
దేశ భాషలందు తెలుగు లెస్స

# ప్రియదత్త

సకుటుంబ సచిత్ర వారపత్రిక

వెల రు. 7/-

06.06.2001



- బాసర జ్ఞాన సరస్వతి
- భలే భలే బొర్రా గుహలు
- స్వర్ణం కంటే విలువైన చిత్రాలు
- సూపర్ స్టార్స్ ప్రేమకబుర్లు

# పేగుబంధం

– ప్రతాప వెంకటసుబ్బారాయుడు

చిరంజీవి నాగేంద్రకి,

నువ్వూ, అమ్మాయి, బాబు క్షేమ మని తలుస్తాను. ఇప్పటిదాక నీకెన్నో ఉత్తరాలు రాశాను. ఒక్కదానికీ సమా ధానం లేదు. నిన్ను చూసి అయిదేళ్ళవు తోంది. మీరెలా వున్నారో చూడాలని మనసులో ఒకటే ఆరాటం. నేను చచ్చేదాక పేగుబంధం తెగి పోదు. 'ఆర్థిక ఇబ్బందుల్లో వున్నానని' నువ్వప్పుడు రాసిన ఉత్తరం చదివాక, నాకు డబ్బు పంపమని రాయడం ఏనాడో మానేశాను. నాన్నగారు చనిపోయాక కొండంత అండగా వుంటావనుకు న్నాను కాని, ఇలా దూరంగా వుంటూ నాకింత మనోవేదన కలిగిస్తావనుకోలేదు. ఆయన బ్రతి కుండగ కష్టమంటే ఎరగని నేను.... రకరకాల పనులు చేస్తూ పొట్ట పోసుకుంటున్నాను. నీ మీద ఆధారపడతానని నువ్వు ఏనాడు అనుకోకు..... నాకు కావలసింది నీ క్షేమం..... మీ క్షేమ సమాచా రాలతో కూడిన ఉత్తరం అంతే.

అన్నట్టు మొన్న ఉగాది సందర్భముగా జెమిని టీ.వి వారు నిర్వహించిన పోటీలో సరదాగా పాల్గొ న్నాను (పక్కింటి మాస్టారి గారింట్లో టీవి చూడడం నాకో వ్యాపకమయింది) రెండు లక్షలు బహు మతిగా వచ్చింది. (ఇంకా చేతికందలేదు.... టాక్స్‌లు అవీ పోను త్వరలో లెక్కలు చూసి అంది స్తారట) ఏ ఆసరా లేని వాళ్ళకి భగవంతుడే ఒక ఆసరా అని అర్థమయింది. వార్ధక్యాన్ని ఆ డబ్బుతో చీకూ చింతా లేకుండా గడిపేద్దామనుకుంటు న్నాను. నీకు వీలుంటే ఒకసారి అమ్మాయితోటి, బాబుతోటిరా, మిమ్మల్ని చూడాలని వుంది. మీ అందరికీ నా ఆశీస్సులు....

ఇట్లు
మీ అమ్మ.

ఉత్తరం ఆసాంతం చదివిన నాగేంద్రకి కలా? నిజమా? అనిపించింది. చదివింది కరెక్టేనా అని మళ్ళీ మళ్ళీ చదివి ఆశ్చర్యానందాలతో ఉక్కిరి బిక్కిరి అయ్యాడు. జెమిని వాళ్ళు నిర్వహించిన కార్యక్రమంలో తన తల్లి పాల్గొనడమేమిటి? వందో రెండొందలో పంపమని దేబిరించే తల్లికి రెండు లక్షలు రావడమేమిటి? దైవిక మంటే ఆదేనేమో? ఇప్పుడు కనక తల్లిని చూసి ప్రేమగా రెండు మాటలు మాట్లాడతే, ఆ డబ్బు మనవడి పేరు మీద ఫిక్స్‌డ్ చేస్తుంది. ఆలోచన వచ్చిందే తడవు 'వసూ' గట్టిగా భార్యని కేకేశాడు.

వంటింట్లో వంట పనిలో తలమునకలయి వున్న వసుంధరకి భర్త పెట్టిన గావుకేక వినిపించి "ఏంటండీ....." విసుగ్గా అంటూ బయటకి వచ్చింది.

"రేపు ఊరెళ్ళి, మా అమ్మని చూస్తున్నాం" అన్నాడు.

"ఏం.... మీ అమ్మని చూడాలని బెంగ పట్టుకుందా?" వెటకారంగా అంది.

"సర్లే ఆపవోయ్ నీ వ్యంగ్యం.... నేను చెప్పేది విన్నావంటే శ్రీమతీ.... పోతుంది నీ మతి" కవితాధోరణిలో. అని "మా అమ్మ జెమిని వాళ్ళు పెట్టిన కాంపిటీషన్లో పార్టిసిపేట్ చేసి రెండు లక్షలు గెలుచుకుందిట ఇప్పుడే ఉత్తరం అందింది" అన్నాడు.

"నిజ్జంగానా...." అని వంటింట్లో అన్నం మాడిపోతున్న విషయం పట్టించుకోకుండా కార్డు భర్త చేతిలోంచి లాక్కుని చదివింది. ఆమెకి కాళ్ళు భూమ్మీద నిలవడం లేదు.

"రేపు నేను ఆఫీసుకెళ్ళి పది రోజుల ఇ.ఎల్ అప్లై చేసి వస్తాను.... సాయంత్రం మన ప్రయాణం" అన్నాడు.

"ఇది నిజమేనంటారా?" అనుమానంగా అడిగింది.

"మా అమ్మ ఎప్పుడు అబద్దాలు చెప్పదు.... సారీ రాయదు. పైగా కాస్త జనరల్ నాలెడ్జి కూడా ఎక్కువే.... నా చిన్నప్పుడు కథలు కూడా రాసేది. నేను పట్టించుకోక పోయినా వృద్దాప్యాన్ని నిర్భయంగా గడిపేస్తోంది. ఆవిడ తెలివి తేటల్ని అంచనా వేయలేం" అన్నాడు.

"అయినా సరే, నేనోసారి పక్కింటి మీనాక్షి గారిని అడిగి కన్ఫర్మ్ చేసుకుంటాను. ఆవిడ ఛానల్ టీ.వికి కళ్ళు అతికించేసి మరీ అన్ని రకాల పోటీల్లో పాల్గొంటుంది. ఎవరెవరికి ఏమేం బహుమతులు వచ్చాయో కంఠతా పట్టేస్తుంది...." చెబుతూ పక్కింటికి పరుగు చేసింది.

మీనాక్షిని కలిసి మొన్న ఉగాది సందర్భముగా జెమిని టీ.వి వాళ్ళు నిర్వహించిన పోటీలో తులసమ్మ అనే ఆవిడకి రెండు లక్షలు వచ్చిందా?" ఆత్రంగా అడిగింది.

"ఆ(..... ఆవిడది బాపట్లే కదా.... అదృష్టవంతురాలు బంపర్ ప్రైజ్ కొట్టింది. ఇంతకి ఈ వివరాలన్నీ మీకెందుకు?" ఆరాతీసింది.

"ఆవిడ మా అత్తగారు" చెప్పి ఇంటికి పరుగులంకించుకుంది. ఆమెకి ఒళ్ళు తూలిపోతున్నట్టు అన్పించసాగింది. రెండు లక్షలన్న పదం చెవుల్లో ప్రతిధ్వనించ సాగింది. "ఏవండీ.... వెంటనే నాకు అత్తయ్యగార్ని చూడాలనుంది. నా నోటితో కంగ్రాట్యులేషన్స్ చెబితే తప్ప మనశ్శాంతి వుండదు. రేపటి దాకా ఎందుకు మీ ఫ్రెండ్‌కి ఫోన్ చేసి లీవ్ విషయం చెప్పేయండి. మనం ఇవాళ రాత్రే రైలెక్కేద్దాం, తెల్లారేసరికల్లా రెండు లక్షల ఆనందంతో మనమూ పాలు పంచుకోవచ్చు... హక్కు దారులమూ కావచ్చు..... ఏవంటారు?" అంది.

కరణేషు మంత్రి చెప్పిన ఉపాయం భేషుగ్గా వుండడంతో వెంటనే స్నేహితుడికి ఫోన్ చేసి 'నేను నాగేంద్రని మాట్లాడుతున్నాను ఊర్నించి అర్జంటుగా రమ్మని మెసేజ్ వచ్చింది ఇవాళ రాత్రికే వెళుతున్నాము. రేపు బాస్‌ని ఎలాగయినా కన్విన్స్ చేసి లీవ్ విషయం చెప్పు నాల్గయిదు రోజుల్లో వచ్చేస్తాము" అని ఫోన్ పెట్టేసి బట్టలు సర్దడంలో భార్యకి సహాయం చేయసాగాడు. వసుంధర పిల్లాడిని గబగబా ముస్తాబు చేసింది. హఠాత్తుగా తననలా ముస్తాబు ఎందుకు చేస్తోందో అర్థంగాక "అమ్మా, మన మెక్కడికి వెళుతున్నాం?" అని అడిగాడు.

"మీ బామ్మ దగ్గరకిరా" అంది.

వాడి ఆనందానికి అవధి లేదు. వేసవి సెలవులకి బామ్మ దగ్గరకి తీసుకెళ్ళమని ఎన్నిసార్లడిగినా తిట్టేవాళ్ళు.... ఇవాళ వాళ్ళంతట వాళ్ళే బామ్మ దగ్గరకి తీసుకెళతామనడం వాడికి విచిత్రంగా వుంది.

రిక్షా దిగిన కొడుకుని కోడల్ని మనవడిని ఆప్యాయంగా ఆహ్వానించింది తులసమ్మ..... ఆమె మనసు ఆనందంతో ఉప్పొంగుతోంది. అన్నేళ్ళ తర్వాత కొడుకుని చూడడం ఆవిడ్ని తీవ్రమైన ఉద్వేగానికి గురి చేస్తోంది. మాతృప్రేమ పెల్లుబుకుతోంది. ఆనంద బాష్పాలకి ఆ కళ్ళు ఆన కట్టలు కట్టలేకపోతున్నాయి.

నాలుగు రోజులు గిర్రున తిరిగిపోయాయి. తల్లి దగ్గర రెండు లక్షల విషయం కదుపుదామని చాలాసార్లు అనుకున్నాడు. కాని, ఎలా కదపాలో తెలియడం లేదు. విషయం ఎలాగైనా కదపమని వసుంధర భర్తకి కనుసైగలతో అనుక్షణం వర్తమానాలు పంపుతూనే వుంది.

రెండు లక్షల విషయం ఆవిడెందుకు చెప్పడం లేదో వాళ్ళకి అర్థం కావడం లేదు.

తల్లిని పువ్వుల్లో పెట్టి చూసుకుంటున్నాడు. కోడలైతే ఆవిణ్ణి కాలు కింద పెట్టనియ్యడం లేదు. మనవడు అహర్నిశలు ఆవిణ్ణి అంటి పెట్టుకుని వుంటున్నాడు. ఒకవేళ ఎప్పుడన్నా వదిలి వెళ్ళినా ఆ తల్లిదండ్రులు వాడిని తెచ్చి ఆవిడ ఒళ్ళో కుదేస్తున్నారు.

ఒకరోజు రాత్రి ఆరు బయట అందరూ కూర్చుని కబుర్లు చెప్పుకుంటుండగా రెండు లక్షల విషయం కదపటానికి అదే అదనని "అమ్మా, నీకు బహుమతిగా వచ్చిన రెండు లక్షలు ఎప్పుడు నీ చేతికొస్తాయి. నేనేమైనా సహాయం చెయ్యాలా?" అన్నాడు.

తులసమ్మ కొడుకు వంకోసారి చూసి దీర్ఘంగా నిట్టూర్చి "నాకే బహుమతి రాలేదు. మమతానురాగాలకి ఇది కాలం కాదు. కేవలం డబ్బు..... డబ్బు మాత్రమే అని బంధాలని కలుపుతోంది.... నిలుపుతోంది. అయితే పేగు బంధం డబ్బు బంధం కన్నా గొప్పది. నువ్వు రెక్కలొచ్చిన పక్షివి. తల్లి పక్షి నోటితో ఆహారం తెచ్చి ఎగరలేని పిల్ల పక్షులకి పెడుతుంది కాని, పెరిగిన పిల్ల పక్షులు మాత్రం ఎగరలేని తల్లి పక్షికి ఆహారం పెట్టడం మనం చూడం... నిజానికి ఏ పశుపక్ష్యాదుల్లో అలాంటిది చూడము. అలా బ్రహ్మతే వృద్ధాప్యాన్ని ఆదుకోకుండా పరిహసిస్తుంది. అయితే వివేక వంతుడైన మానవుడు మాత్రం తను పెరిగి పెద్ద వాడై తల్లిదండ్రులని ఆదుకోవడం ధర్మం అనుకున్నాడు. కాని స్వార్థం మితిమీరిపోయిన ఈ రోజుల్లో రెక్కలొచ్చిన పక్షుల్లా ఎగిరిపోతున్నారు. నిన్ను చూసి అయిదేళ్ళయింది... నీ నుండి వచ్చిన ఉత్తరం చదివి రెండేళ్ళవుతోంది. నిన్ను చూడాలని, ఉత్తరంలో నీ క్షేమ సమాచారాన్ని చదవాలని ఈ తులసి ప్రాణం ఎంతగా అల్లల్లాడి పోతుందో నీకు తెలుసా? నువ్వు నాకేం పెట్టక పోయినా ఫర్వాలేదు. నువ్వు క్షేమంగా వున్నావన్న వార్త నా చెవిన పడితే చాలు. నిన్ను చూడాలని వుందన్నా రావు. నాకు సీరియస్‌గా వుందని కబురంపినా రావు. ఈ వయసులో ఈ తల్లిని ఎందుకురా అంత క్షోభ పెడతావు? నా బాధని చూసి మీ నాన్నగారి స్నేహితుడైన మాస్టారుగారు విచలితుడయిపోయేవారు. కాకతాళీయంగా ఒకసారి మేమందరం టీ.వి చూస్తుంటే మన ఊళ్ళో నా పేరుగల ఆవిడకి బహుమతి రావడం చూసి 'చెల్లెమ్మా నీ కొడుకుని నువ్వు చూసుకునే ఉపాయం తట్టిందమ్మా....' అని చెప్పాడు. డబ్బనంగానే ఏ కొడుకైనా పరిగెత్తుకు వస్తాడని నాకూ తెలుసు. నా కొడుకు అందుకు మినహాయింపేమీ కాదని నిరూపించావు. సెలవులు వస్తే వాళ్ళే ఊటీల్లో హాయిగా గడుపుతారు.... ఎల్ టి సి లతో ఎంతో దూరాలకి వెళ్ళి ఎంజాయ్ చేస్తారు. పిసినారి అయినా పెట్టుకుని... కళ్ళలో వత్తులు వేసుకుని ఎదురు చూసే తల్లిదండ్రులని చూడాలని ఎందుకనిపించదు? కనీసం కార్డు ముక్కన్నా రాయరెందుకు? గర్భాన పుట్టిన వాళ్ళే అగ్నిపుత్రులవల్లా ప్రవర్తిస్తుంటే ముసలి హృదయాలు ఎంత తల్లడిల్లి పోతాయో తెలుసా? ఆ భగవంతుడు పిల్లల గుండెల్ని పాషాణాలుగా ఎందుకు మార్చాడో, తల్లి మనసుని అనుక్షణం పిల్లల క్షేమం కోరే మార్దవంతో ఎందుకు నింపాడో తల్లి కాటికి పోయేదాకా పేగు బంధం పోదు. జవసత్వాలుడిగి పోయి... రోగాలతో యుద్ధం చేస్తూ మృత్యువునించి నేనెంతో కాలం తప్పించుకోలేను. కనీసం నేను చచ్చేదాకన్నా... నన్ను చూడడానికి రాకపోయినా... ఒక కార్డు ముక్కన్నా మీ క్షేమ సమాచారాలతో రాయి. అదే నీ ఈ తల్లికి ప్రాణం పోసి పునర్జీవితురాల్ని చేస్తుంది. లేదంటే కొడుకు కోసం పలవరిస్తూ కన్ను మూస్తుంది. బ్రతికున్న ఈ నాల్రోజులు నీ తల్లికి పుత్ర వాత్సల్య భిక్ష పెట్టుబాబు....'' ఆవిడ గొంతు దుఃఖంతో జీరపోయింది.



తల్లి తన దగ్గర ఉందామని వస్తే, నానా మాటలు అని గెంటేయడం..... ఇప్పటిదాకా ఆ తల్లిని తల్చుకోకపోవడం అన్నీ గుర్తుకొచ్చి అతని మనసు శరాఘాతానికి గురైనట్టయింది. చిన్నప్పటి నుండి పెళ్ళయ్యేదాక ఆవిడ చూపిన ఆప్యాయతకి ఋణ గ్రస్తుడై.... కృతఘ్నుడిగా ప్రవర్తించినందుకు తన మీద తనకే సిగ్గేసింది.

"అమ్మా" తల్లి ఒడిలో కళ్ళ నీళ్ళతో ఒరిగిపోయాడు. ఆ వెచ్చని ఒడిలో చిన్నప్పటి అనుభూతులన్నీ ఒక్కొటొక్కటిగా మస్తిష్కంలో మెదలసాగాయి. కృత్రిమత్వంలో కొట్టుమిట్టాడుతూ ఇన్నాళ్ళూ ఏం కోల్పోయాడో అనుభవంలోకి వచ్చింది.

కొడుకు ఎంత పెద్దవాడైనా తల్లి ఒడిలో పిల్లవాడే, ఆవిడ చేయి కొడుకు తల నిమురుతోంది.

అది చూసి వసుంధర కూడా బాబుని ఎత్తుకుని ముద్దులతో ముంచెత్తింది. ❋